ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 22 అక్టోబరు 2025

ఎస్టీఎఫ్ సీఐనే బెదిరించారా ?

- స్టేషన్‌కొచ్చి బెల్ట్‌షాపు నిర్వాహకుడితో పాటు మద్యం బాటిళ్లు తీసుకెళ్లారా ?
- నకిలీ మద్యం కేసులో వెలుగులోకి కొత్త విషయాలు
- సొంత శాఖలో అధికారులు, సిబ్బంది పాత్రపై విచారణ
- త్వరలో మరికొందరిపై వేటు?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో అక్రమార్కులు చేసిన అనేక ఆగడాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. ఎక్సైజ్ పోలీసులు నకిలీ మద్యం బాగోతాన్ని బయటపెట్టకముందే ఈ మద్యం తయారీ ముఠా ఓ ఎక్సైజ్ అధికారిని బెదిరించి ఎక్సైజ్ స్టేషన్ నుంచి బెల్ట్‌షాపు నిర్వాహకుడితో పాటు నకిలీ మద్యం బాటిళ్లను దౌర్జన్యంగా తమతో తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఓ సీఐని ఈ నకిలీ మద్యం తయారీ వెనుక ఉన్న వివరాలు నిగ్గు తేల్చేందుకు పంపించారు. ఈయన విచారించి పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వడంతో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నకిలీ మద్యం గుట్టు రట్టయినట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీ, విక్రయం ముఠా వెనుక పెద్దతలకాయల బలమైన సహకారం ఉండడంతోనే సాక్షాత్తు అధికారులనే వారు బెదిరించే స్థాయికి చేరారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ములకలచెరువులో పట్టుబడ్డ నకిలీ మద్యం బాటిళ్లు (ఫైల్)

ఎస్టీఎఫ్ సీఐనే బెదిరించారా?

విశ్వసనీయ సమాచారం మేరకు నకిలీ మద్యం వ్యవహారం బయటపడక ముందు ఎక్సైజ్ శాఖలోని ఓ ఎస్టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్) సీఐ గత నెల 26న పెద్దమండ్యం మండలం బండ్రేవులో ఉన్న బెల్ట్‌షాపుపై తన సిబ్బందితో దాడులు చేశారు. అక్కడున్న మద్యం బాటిళ్లు స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి బెల్ట్‌షాపు నిర్వాహకుడిని నకిలీ మద్యం బాటిళ్లను తీసుకుని ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న నకిలీ మద్యం తయారీ ముఠాకు చెందిన ముఖ్య నాయకుల అనుచరులు ఎక్సైజ్ స్టేషన్‌లోకే వచ్చి ఎస్టీఎఫ్ సీఐని బెదిరించి బెల్ట్‌షాపు నిర్వాహకుడిని విడిచిపెట్టి నకిలీ మద్యం బాటిళ్లు ఇవ్వాలని భయపెట్టారు. దీనికి సీఐ ఒప్పుకోకపోవడంతో బెల్ట్‌షాపు నిర్వాహకుడిని, నకిలీ మద్యం బాటిళ్లను దౌర్జన్యంగా తీసుకెళ్లారు. ఈ విషయాన్ని సీఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు రహస్యంగా కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐని విచారణకు పంపారు. ఆయన పెద్దమండ్యం మండలం బండ్రేవు బెల్ట్‌షాపుపై నిఘా ఉంచి నకిలీ మద్యం ములకలచెరువు నుంచి వస్తోందని గుర్తించారు. ఈ క్రమంలో ఈనెల 3న కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రంపై మెరుపు దాడులు నిర్వహించి గుట్టును రట్టు చేశారు. ఈ విషయాలన్నీ ఎక్సైజ్ ఉన్నతాధికారుల విచారణలో బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది.

మరికొందరు అధికారులపై వేటు

ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో అతి త్వరలోనే మరికొందరు ఎక్సైజ్ అధికారులపై వేటు పడవచ్చని సొంత శాఖలోనే విపరీతమైన చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ, అమ్మకాల గురించి స్థానిక ఎక్సైజ్ సీఐతో పాటు ఓ జిల్లా స్థాయి అధికారికి, ఇంకా కొందరికి చాలా క్షుణ్ణంగా తెలుసనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన ఓ కీలక అధికారి, ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేసే ఒకరిద్దరిపై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందురెడ్డి ఇప్పటికే సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. నకిలీ మద్యం తయారీ, యథేచ్ఛగా బెల్ట్‌షాపులకే తరలించి అమ్ముతున్నా జిల్లా అధికారి ఎందుకు మౌనంగా ఉన్నారనే కోణంలోనూ అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీ బయటపడకముందు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రంలతో పాటు పలు గ్రామాలకు సుమారు రెండు నెలల పాటు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, సిబ్బంది దాడులు చేయకపోవడానికి గల కారణాలపైనా ఆరా తీస్తున్నారు. ఈ కారణంగానే నకిలీ మద్యం కేసు విచారణలో కీలక అధికారిని ఉన్నతాధికారులు పక్కన పెట్టినట్లు ఎక్సైజ్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తూ నకిలీ మద్యం తయారీ అక్రమార్కులకు సహాయ సహకారాలు అందించిన సిబ్బంది పాత్రపై ఆరా తీస్తున్నారు. దీంతో ఒకటి రెండు రోజుల్లో ఎక్సైజ్ శాఖలో పలువురిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

నూనెవాండ్లపల్లె వద్ద బ్రిడ్జిని పరిశీలిస్తున్న తహసీల్దారు శివకుమార్



ఉధృతంగా ప్రవహిస్తున్న పింఛా నది

పీలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీలేరుతో పాటు ఎగువ ప్రాంతాలైన చిత్తూరు జిల్లా సదుం, సోమల మండలాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పరీవాహక ప్రాంతమైన పీలేరు, బాలంవారిపల్లె, గూడరేవుపల్లె, దొడ్డిపల్లె, బోడుమల్లువారిపల్లె పంచాయతీల్లోని చెక్‌డ్యాంలు, చిన్న చిన్న కుంటలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. భారీ వర్ష సూచన నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులు మండలంలోని నీటి వనరుల వద్ద నిఘా పెంచారు. పింఛా నది ప్రవాహ ఉధృతి కారణంగా దొడ్డిపల్లె పంచాయతీ నూనెవాండ్లపల్లె సమీపంలోని బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతాన్ని తహసీల్దారు శివకుమార్ మంగళవారం పరిశీలించారు. ఆ మార్గంలో ఎవరినీ అనుమతించకుండా బ్రిడ్జి వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా రెవెన్యూ అధికారులను సంప్రదించాలని ప్రజలకు తెలిపారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన మధురై ఎక్స్‌ప్రెస్

పీలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ-మధురై మధ్య నడిచే స్పెషల్ ట్రైన్ (0107191) మంగళవారం ఉదయం పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద నిలిచిపోయింది. రైలు ఇంజన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా రైలు మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో లెవల్ క్రాసింగ్ వద్ద ఆగిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైలు పైలెట్లు సమస్యను సరిజేసుకుని తిరిగి బయలుదేరడంతో ట్రాఫిక్ సాఫీగా సాగింది.



పీలేరు-చిత్తూరు మార్గంలో మధురై ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో ఆగిన వాహనదారులు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 08561-293006 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంట్రోల్ రూంలో 24 గంటలు సిబ్బంది ఉండేలా ఏర్పాటు చేశామని తెలియజేశారు. సహాయక చర్యలు కోసం కంట్రోల్ రూంను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

మదనపల్లెలో: మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు భారీ వర్షాలు కురవనున్న కారణంగా అత్యవసర పరిస్థితుల సమాచారం కోసం సబ్ కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి తెలిపారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే కంట్రోల్ రూం నెంబర్ 08571-231181 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. 24 గంటలు సబ్ కలెక్టరేట్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

జగన్ హయాంలో అరాచక పాలన

- ఎంపీ సీఎం రమేశ్



తరగతి గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేశ్, చిత్రంలో టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని, అభివృద్ధి జరిగింది మాత్రమే శూన్యమని అనకాపల్లె పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ అన్నారు. రాజంపేట పట్టణం సరస్వతి విద్యా మందిరంలో రాజ్యసభ సభ్యుడి కోటా కింద రూ.20 లక్షలతో నిర్మించిన తరగతి గదులను అనకాపల్లె ఎంపీ సీఎం రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు సరస్వతి విద్యామందిరం అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ చెన్నూరు సుధాకర్, కాకర్ల రాముడు, రాధాకృష్ణ తదితరులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ విద్యా మందిరం అభివృద్ధికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ఎవరూ నమ్మరన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, శ్రీశైలం దేవస్థాన చైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు, ఆర్టీసీ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. రాజంపేటకు వచ్చిన ఎంపీ సీఎం రమేశ్‌కు బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బీజేపీ నాయకులతో పాటు టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలందరూ గుర్తించుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో మంత్రి సాయుధ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అమరులైన పోలీసువీరులకు మంత్రితో పాటు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ శాంతి భద్రతల పరిరక్షణలో, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో, చట్టాలను పరిరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందని, శాంతిభద్రతల పరిరక్షణలో మాత్రమే కాకుండా రాత్రి పూట పెట్రోలింగ్, ట్రాఫిక్‌ను నియంత్రించడం, మెడికల్ ఎమర్జెన్సీలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాల్లో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ దేశ భద్రత కోసం పగలనక, రేయనక విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లు, అధికారులు విధులను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా వారు తమ ప్రాణ త్యాగాలను, సేవలను సింహావలోకనం చేసుకుంటూ సేవల అర్థాన్ని పరమార్థాన్ని గుర్తిస్తూ కొనియాడటం మనందరి కర్తవ్యమన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, కరుడుగట్టిన మతోన్మాదం మితి మీరి



పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో మంత్రి మండిపల్లి, ఎస్పీ ధీరజ్, జేసీ రాజేంద్రన్ తదితరులు

పోతున్న ప్రస్తుత రుణంలో పోలీసులు వృత్తి ప్రాణాలతో చెలగాటమని తెలిసి కూడా వాటిని లెక్క చేయక ప్రజా సేవలో నిమగ్నం అవుతున్నామన్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడే క్రమంలో పోలీసులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లాలోని సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అరటి తోటలోకి చేరిన వరద నీరు



రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న గుంజన నది

రైల్వేకోడూరులో భారీ వర్షం

- తోటల్లోకి చేరిన నీరు
- గుంజన నదికి చేరిన వరద నీరు
- రెడ్డివారిపల్లె-కోడూరు మధ్య నిలిచిపోయిన రాకపోకలు

రైల్వేకోడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. దుకాణాల్లోకి వర్షపు నీరు చేరడంతో వస్తువులు తడిసిపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. గుంజననదిలోకి వరద నీరు చేరింది. తిరుపతి-కోడూరు మార్గంలో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. అరటి, బొప్పాయి, మామిడి తోటల్లోకి వరద నీరు చేరింది. రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకులపేట, కొత్తబజారు, నరసరాంపేట, రైల్వేస్టేషన్ రోడ్లు మొత్తం జలమయమయ్యాయి. ప్రధాన దారిలో ఏరులా వరద నీరు ప్రవహించింది. వర్షం ఉధృతి ఎక్కువగా ఉండడంతో రైతులు తమ తోటల్లో కాలువ గట్లను తెంపేందుకు సిద్ధమయ్యారు. సజ్జ, మొక్కజొన్న, కూరగాయల తోటల్లో నీరు నిలువ ఉండకుండా రైతులు అప్రమత్తమయ్యారు. రాత్రికి గుంజన నదిలోకి వరద నీటి ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయి. రెడ్డివారిపల్లెకు వెళ్లే మార్గంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. దీంతో గుంజన నదిలోనే తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేశారు. నీటి ప్రవాహంతో తాత్కాలిక రోడ్డుపై వరద నీరు వెళ్లడంతో రెడ్డివారిపల్లె, గుర్రప్పపాళెం తదితర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెడ్డివారిపల్లె ప్రజలు తాత్కాలికంగా పాటిమీదిపాళెం, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇటు రైతులు, అటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



రైల్వేకోడూరులో వ్యాపార సముదాయాల్లోకి చేరిన వర్షపు నీరు

పీలేరుకు డయాలసిస్ కేంద్రం

- ప్రకటించిన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్
- ఫలించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రయత్నం

పీలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు, దాని పరిసర ప్రాంతాల్లోని డయాలసిస్ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి పండుగ నేపథ్యంలో ఓ శుభవార్త చెప్పింది. పీలేరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రకటించారు. దీంతో పీలేరు నియోజకవర్గంతో పాటు దాని పొరుగున ఉన్న చిత్తూరు జిల్లా పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం, తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలగనుంది. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లోని డయాలసిస్ రోగులు తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రితోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రులు, మదనపల్లెలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పీలేరులో కేంద్రం ఏర్పాటైతే వారందరూ ఇక్కడే డయాలసిస్ చేయించుకునే అవకాశం ఏర్పడుతుంది. పీలేరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు ప్రధాన మంత్రి డయాలసిస్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం (పీఎంఎన్‌డీపీ) ద్వారా రాష్ట్రంలో కొత్తగా 7 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రకటించారు. ఆ ఏడు కేంద్రాల్లో పీలేరు ఉండడం విశేషం. అయితే డయాలసిస్ కేంద్రాన్ని పీలేరు-తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నిర్వహించిన భవనంలో ఏర్పాటు చేస్తారని, తొలుత 5 మందికి చికిత్స అందిస్తారని, తరువాతి కాలంలో మరికొంత మందికి అవకాశం కల్పిస్తారని పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. పీలేరు మండలంలో ప్రస్తుతం 15 మంది డయాలసిస్ రోగులకు ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా ప్రతి నెలా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తోంది. పీలేరు నియోజకవర్గంలోని ఇతర మండలాలతో పాటు పులిచెర్ల, సదుం, రొంపిచెర్ల, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో ఇంకో 100 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నారని అధికారుల అంచనా వేస్తున్నారు. పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరు పట్ల ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ నేతలు కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పోలిశెట్టి సురేంద్ర, శ్రీనాథరెడ్డి, బీజేపీ పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.



పీలేరు ఏరియా ఆసుపత్రి

నీళ్లు లేని చెరువులు ... బీళ్లుగా భూములు

- రాజంపేట డివిజన్‌లో చెరువుల్లో నీరు లేక వెలవెల
- దిగాలు చెందుతున్న రైతన్నలు

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రమంతా భారీ ఎత్తున వర్షాలు కురిసి నదులు, వాగులు పొంగి ప్రవహిస్తూ చెరువులు, కుంటలు, బోరుబావులకు పెద్దఎత్తున నీరు చేరి వ్యవసాయానికి సిద్ధమై పచ్చని పంట పొలాలతో కళకళలాడుతుండగా రాజంపేట డివిజన్‌లో పూర్తిగా కరవు ఛాయలు ఏర్పడ్డాయి. అప్పుడప్పుడూ చెదురుమదురు వర్షాలు కురుస్తూ గడ్డి, కంపచెట్లు పచ్చగా మారగా ఎక్కడా కనీస వర్షపాతం కూడా పడలేదు. ఏడాదికి 720 మి.మీ. కనీస వర్షపాతం రాజంపేట ప్రాంతంలో కురవాల్సి ఉండగా ఇప్పటికి 200 మి.మీ. వర్షపాతం కూడా నమోదు కాలేదు.

తిరుపతి జిల్లాకు శేషాచలం అడవులు ఆనుకుని ఉన్న ఒక్క రైల్వేకోడూరు మండలంలో కొద్దిపాటి వర్షం పడింది తప్ప మిగిలిన మండలాల్లో దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మామూలుగా ఉమ్మడి కడప జిల్లాలో పంట పొలాలకు, పాడికి రాజంపేట డివిజన్ పెట్టింది పేరు. ఇక్కడ 200కు పైబడి చెరువులు, కుంటలు ఉన్నాయి. ఒక్క ప్రాజెక్టు లేక పోయినప్పటికి ఒకవైపు శేషాచలం కొండలు, మరోవైపు నెల్లూరు సరిహద్దు పెనుశిల అభయారణ్య అడవులు ఉండడం వల్ల సహజంగానే వర్షాలు కురవడం. దీనివల్ల చెరువులు, కుంటలు నిండడం, బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగడం, తద్వారా లక్ష ఎకరాలకు పైబడి సాగవుతూ ఉండేది. చెరువులు, కుంటల కిందే ఈ లక్ష ఎకరాల వరి పంట పండేది. వరి ధాన్యం విస్తారంగా పండడం వల్ల ఈ రెండు నియోజకవర్గాల రైతులకు పుష్కలంగా ఏడాదికి కావాల్సిన ఆహారం లభించి వేల టన్నుల వరి పంటను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు గడించేవారు. రెండు సంవత్సరాలుగా ఏమైందో ఏమోగాని కనీస వర్షపాతం నమోదు కాలేదు. ఒక మోస్తరు వర్షాల వల్ల తాగునీరు లభిస్తుందే తప్ప సాగునీరు లభించడం లేదు. రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, ఒంటిమిట్ట ప్రాంతాల్లోని పెద్దఓరంపాడు చెరువు, ఎల్లమరాజుచెరువు, రెడ్డిపల్లె చెరువు, నగిరిపాడు చెరువు, నాగవరం, చెరువులు, ఊటుకూరు, చెర్లోపల్లె, తాళ్లపాక, లేబాక, ఒంటిమిట్ట, మైలపల్లెల్లోని వందలాది చెరువులు వరదనీరు రాక చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. దీనివల్ల ఆయకట్టు భూములన్నీ బీటలు వారి ఉన్నాయి. ఒక్కో రైతుకు చెరువుల కింద ఎకరా నుంచి 50 ఎకరాల పొలం ఉన్న రైతులున్నారు. ఈ పొలాలన్నీ వరి పంట పండేవే. అయితే వర్షాలు పడకపోవడంతో ఈ భూములన్నీ ప్రస్తుతం బీటలువారి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో మాత్రం వరి పంట విస్తారంగా సాగవుతోంది.



చుక్కనీరు లేక వెలవెలబోతున్న ఊటుకూరు చెరువు



చుక్కనీరు లేక రైతులను వెక్కిరిస్తున్న హస్తవరం చెరువు



చెరువులో నీరు లేక సాగుకు నోచుకోని భూములు

రెండేళ్లుగా వర్షాలు అంతంత మాత్రమే



రెండేళ్లుగా వర్షాలు కురవక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ సమయానికే బాగా వర్షాలు కురిసి వరి పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం వర్షాలే కురవకపోవడంతో భూములన్నీ బీళ్లుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల వరి పంట పండించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి పరిస్థితి నుంచి ఇంటి అవసరాలకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

-బండారు బాలయ్య, రైతు, మన్నూరు, రాజంపేట

లక్ష ఎకరాల్లో సాగయ్యేది



బాగా వర్షాలు కురిస్తే రాజంపేట డివిజన్‌లో చెరువులు, బోరు బావులు, కుంటల కింద లక్ష ఎకరాల్లో వరి పంట సాగయ్యేది. అటువంటిది చెరువుల కింద ఒక్క ఎకరా కూడా పండే పరిస్థితి కనిపించడం లేదు వాతావరణ ప్రతికూల పరిస్థితులే ఇందుకు కారణం. ఏ గ్రామంలో చూసినా చెరువుల కింద వేల ఎ కరాల్లో వరిని సాగు చేస్తూ పచ్చని పొలాలతో కళకళలాడే పరిస్థితి నుంచి నేడు ఎకరా సాగు కాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

- మధుసూదన్‌రెడ్డి, రైతు, తాళ్లపాక, రాజంపేట మండలం

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు మెస్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం పులివెందుల జేఎన్టీయూలోని మెస్ ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెస్ ఇన్‌చార్జి, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి ఆయ న వంటగది, ఆహార నిల్వ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్ గదులు, పరిసరాలు, టాయిలెట్లు, డ్రింకింగ్ వాటర్ సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి వాతావరణం ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్దన్, మెస్ మేనేజర్ జి.మురళి పాల్గొన్నారు.

సీబీఆర్‌కు నీటి విడుదల నిలిపివేత



లింగాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు అధికారులు నీటి విడుదలను నిలిపివే శారు. గండికోట ప్రాజెక్టు నుంచి నెల రోజులుగా ఎత్తిపో తల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హత్య కేసుగా నమోదు చేసిన టూటౌన్ పోలీసులు



శశికళ (ఫైల్)

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం శేషప్పతోటకు చెందిన వెంకటరమణ, శశికళకు 30 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి సృజన్ అనే కుమారుడు, సాత్విక వర్షిణీ అనే అమ్మాయి ఉన్నారు. వెంకటరమణ గతంలో బీఎస్ఎఫ్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు 20 ఏళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. అయితే కుమారుడు, కుమార్తె ఇద్దరూ తల్లి వద్దే ఉంటూ చదువుకున్నారు. ప్రస్తుతం కుమారుడు సృజన్ ఉద్యోగపరంగా బయట ఉండడంతో, కుమార్తె సాత్వికవర్షిణీ లండన్‌లో ఎంఎస్సీ చదువుతోంది. వారిది సొంత ఇల్లు కావడంతో ప్రస్తుతం శశికళ ఒక్కరే ఇంట్లో ఉంటోంది. ఇదిలా ఉండగా ఈనెల 6వ తేదీ మదనపల్లెకు వచ్చిన వెంకటరమణ తన తమ్ముడు రాజన్నతో కలిసి శేషప్పతోటలోని ఇంటికి వెళ్లి ఇల్లు తన పేరిట ఉందని, తనకు ఇవ్వాలని భార్య శశికళతో గొడవపడ్డారు. దీనికి ఆమె నిరాకరించడంతో కొట్టి బలవంతంగా నోట్లో యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే ఆమె లండన్‌లోని తన కుమార్తెకు సమాచారం ఇచ్చింది. స్థానికులు శశికళను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతి చెందింది. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శశికళ కుమారుడు సృజన్ ఫిర్యాదు మేరకు టూటౌన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మంగళవారం హత్య కేసుగా మార్చామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

కారు, బస్సు ఢీ : నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెద్దమండ్యం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం కోటకాడపల్లి పంచాయతీ తాటిమాకులపల్లి వాసి కుళాయిరెడ్డి, మదనపల్లిలో సచివాలయ ఉద్యోగి. కాగా ఆదే గ్రామానికి చెందిన స్రవంతి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీరు దీపావళి పండుగకు స్వగ్రామానికి వచ్చి తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి మంగళవారం ఉదయం కలిచెర్ల బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నారు. కాగా గాలివీడు మండలం ప్యారంపల్లి పంచాయతీ పూలవాండ్లపల్లికు చెందిన జగదీష్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన స్నేహితుడితో కలిసి కారులో బెంగుళూరుకు బయలుదేరారు. కలిచెర్ల బస్టాప్ వద్ద చేరుకున్న కారులోని జగదీష్‌రెడ్డిని లిఫ్ట్ అడిగి అందులో బయలుదేరారు. బండమీదపల్లి పంచాయతీ కొట్టెవాండ్లపల్లి డాబా వద్ద కారు అదుపు తప్పి మదనపల్లి నుంచి గాలివీడుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆ నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. వీరిలో కుళాయిరెడ్డి, స్రవంతి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం పోలీసులు వెల్లడించారు.

విషద్రావణం తాగి మహిళ మృతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామం రాగిమాకులపల్లె వాసి విశ్వనాథరెడ్డి భార్య శారద (40) ఆదివారం కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి మనస్థాపంతో విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. సోమవారం సాయంత్రం మృతి చెందింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు

- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు
- అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం డైట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని 8 నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహనను పెంపొందించడానికి, లైంగిక దాడుల నుంచి మహిళలు, బాలల రక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలు రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రం, మదనపల్లి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, రాజంపేట పట్టణంలోని మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో డివిజన్ వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలను 26వ తేదీ ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడతాటలి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుమలో గంగమ్మ పూజకు వెళుతూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. ముగ్గురికి గాయాలు



తేజ (ఫైల్), ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కనుమలో గంగమ్మ ఆలయంలో జరిగే పూజకు వెళుతూ జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళవారం ఉదయం కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ చింతయ్యగారికోటకు చెందిన యువకులు బైక్‌పై మదనపల్లె మండలం బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డులో ఉన్న కనుమలో గంగమ్మ ఆలయంలో చేస్తున్న పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతూ బసినికొండ వద్ద జాతీయ రహదారి కూడలిలో రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో చింతయ్యగారికోటకు చెందిన రవి కుమారుడు తేజ (19) అక్కడికక్కడే మృతి చెందగా అతడి బైక్‌లో వెనకనున్న రాధాకృష్ణ కుమారుడు జగదీశ్ (20) గాయపడ్డాడు. మరో బైక్‌లో ఉన్న వేంపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు సంతోష్ (21), మహేశ్ కుమారుడు ప్రేమకుమార్ (8) గాయపడ్డారు. వేంపల్లె నుంచి నిమ్మనపల్లెకు తమ అక్క ఇంటికి బైక్‌లో బయలుదేరిన వీరి బైక్ తట్టివారిపల్లె వైపు నుంచి వస్తున్న బైక్‌ను ఢీ కొంది. స్థానికులు క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మదనపల్లె తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బస్సు-లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



బస్సు లారీ ఢీ కొన్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో మంగళవారం ఆర్టీసీ బస్సు లారీని ఢీకొంది. ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుంచి ప్రొద్దు టూరు వెళ్లేందుకు బస్టాండు నుంచి సర్కిల్ సమీపానికి రాగానే ముద్దనూరు వైపు నుంచి కడప వైపు వెళుతున్న లారీ రావడంతో అదుపు తప్పి ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఎవ రికీ ప్రమాదం జరగలేదు. ఆర్టీసీ బస్సు అద్దాలు పగిలా యి. కాగా, ఎర్రగుంట్ల బస్టాండు నుంచి ప్రొద్దుటూ రుకు వెళ్లే బస్సులన్నీ సర్కిల్‌ను చుట్టి రాకుండా రాంగ్ రూటు లో నేరుగా బ్రిడ్జిపైకి వెళ్లడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

8 మంది జూదరుల అరెస్టు

కడప క్రైం, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన 8 మంది జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసిన వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వల్లూరులో నలుగురు...

వల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లెలో మంగళవారం నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూములు దక్కలేదని వ్యక్తి ఆత్మహత్య

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామంలో ఉన్న తమ భూములు తమకు దక్కలేదన్న బాధతో మద్యానికి బానిసైన గురజాల పాపారావు (48) సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడుకు చెందిన గురజాల పాపారావు కొంతకాలంగా రాయచోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో న్యాచురల్ జ్యూస్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని తమ భూముల కోసం అధికారుల చుట్టూ తిరిగినా, తమకు దక్కకపోవడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలియజేశారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో మృతి చెందిన వ్యక్తిని తన భర్తగా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి ఆ వ్యక్తి కుటుంబాన్ని బెదిరిస్తున్న షేక్ అమీనా అనే మహిళపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కడప టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు కడప అగాడికి చెందిన తాజున్నిసా అనే మహిళ భర్త మహబూబ్‌బాషా 2015లో మృతి చెందాడు. అయితే షేక్ అమీనా అనే మహిళ గత కొంతకాలంగా మహబూబ్‌బాషా తన భర్త అని, తమకు నసీమా అనే కుమార్తె కూడా ఉందంటూ వారిద్దరి మ్యారేజ్ సర్టిఫికెట్ చూపించి ఆస్తుల్లో భాగం కావాలని తాజున్నిసాను బెదిరిస్తుండేది. దీంతో ఆమె గురించి చుట్టుపక్కల విచారించగా ఆమె లక్ష్మీదేవి అని గుర్తించారు. దీంతో ఆమె దగ్గర ఉన్న మ్యారేజ్ సర్టిఫికెట్లను పరిశీలించగా అవి నకిలీవని గుర్తించినట్లు తెలిపారు. తాజున్నిసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ అమీనా అలియాస్ లక్ష్మీదేవిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జోనల్ మలేరియా అధికారిగా

అలెగ్జాండర్ బాధ్యతల స్వీకరణ



కడప (కలెక్టరేట్), అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): కడప జోనల్ మలేరియా అధికారిగా డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ మంగళవారం పాత రిమ్స్‌లోని జెడ్ఎంవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన టెక్కలి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కడప జోనల్ మలేరియా కార్యాలయానికి బదిలీపై వచ్చారు. రెండు నెలల కిందట జెడ్ఎంవోగా విధులు నిర్వహిస్తూ డాక్టర్ జమాల్‌బాష పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో ఇప్పటివరకు రిమ్స్ ఆర్ఎంవో శ్రీనివాసులు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

వై.కోట చెరువుకు మరమ్మతులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని వై.కోట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెరువు అలుగుకు సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య మంగళవారం మరమ్మతులు చేయించారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వై.కోట చెరువులకు భారీఎత్తున నీరు చేరితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ముందస్తుగా పనులు చేయించారు. దీంతో గ్రామ ప్రజలు ఆయనను అభినందించారు.

పైథాన్ ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్

రామాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పైథాన్ యొక్క ప్రాథమిక అంశాల నుంచి డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి ఆధునిక విభాగాల వరకు విద్యార్థులు ప్రాజెక్టు ఆధారిత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సీనియర్ కంప్యూటర్ విజన్ సైంటిస్ట్ డాక్టర్ సుధాకర్ అన్నారు. మండలంలోని బండపల్లి సమీపంలోని బిట్స్ కళాశాలలో మంగళ, బుధవారం పైథాన్ ప్రోగ్రాం ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన నిరంతర అభ్యాసం, సృజనాత్మకత ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ , కళాశాల సిబ్బంది సుధాకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి రత్నం, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

రాయచోటిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఇబ్రహీం అనే వ్యక్తి కుటుంబానికి మంగళవారం మానవత సంస్థ రూ.10,116 ఆర్థిక సాయం అందజేసింది. సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, అధ్యక్షులు అంకం జయచంద్రారెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, రాయచోటి పెన్షనర్ సంఘం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి ఈ మొత్తాన్ని అందజేశారు. సంస్థ ట్రెజరర్ నాగార్జున, మాజీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, శివారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్యానికి విరాళం



ధూపదీప నైవేద్యానికి నగదును అందజేస్తున్న దాతలు

గాలివీడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ దేవాలయాల్లో ధూపదీప నైవేద్యానికి రిటైర్డ్ లెక్చరర్ కానాల బయ్యారెడ్డి, ఉపాధ్యాయులు శివారెడ్డి వెయ్యి రూపాయలు చొప్పున వితరణ చేశారు. పందికుంట పంచాయతీలో ఆదిభైరవ గుడి పూజారికి, నూలివీడు పంచాయతీ కొత్త బండివాండ్లపల్లె సమీపంలోని శివాలయంలో పూజలు నిర్వహించే పూజారులకుప్రతి నెల రూ.1000 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సరస్వతిపల్లి సర్పంచ్ మున్నీర్‌బాషా, చిట్లూరు గ్రామం హసనాపురం గ్రామం కొండావాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు భవనం వెంకట్రామిరెడ్డి కుమారుడు రమేశ్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం సర్పంచ్ మునీర్‌బాషా ఇంటి వద్ద మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించి అర్హులైన వారికి పట్టాలివ్వాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 9 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయ్యిందని, మిగిలిన గ్రామాల్లో త్వరగా సర్వే పూర్తి చేస్తామని తహసీల్దార్ వెంకటేశులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రీసర్వే చేసేటప్పుడు గ్రామాల్లోని రైతులకు ముందుగా తెలియజేయాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తహసీల్దార్‌కు సూచించారు. నాలుగు రోజుల్లో సీకే రోడ్డు నుంచి సరస్వతిపల్లెకు వెళ్లే రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రోజుకు రెండు గ్రామాలు చొప్పున ఎంపిక చేసుకుని ఆయా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించవచ్చని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెం: ప్రతి సమస్యకు కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించడంతోపాటు, పరిష్కారానికి కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగ్రామమైన బోరెడ్డిగారిపలెలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు నాయకులు దుశ్శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

సీఎం రమేశ్‌తో టీడీపీ, బీజేపీ నేతల భేటీ



సీఎం రమేశ్‌తో టీడీపీ, బీజేపీ నేతలు

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :స్థానిక టీడీపీ నాయకుడు కావుటూరి సుబ్రమణ్యంనాయుడు(మణి) ఇంట్లో మంగళవారం కేంద్ర రైల్వేబోర్డు చైర్మన్ అనకాపల్లె పార్లమెంట్ సభ్యులు సీఎం రమేశ్‌తో రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్, టీడీపీ నేత కావుటూరి ఆది నారాయణ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు, జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు శివన్నారాయణచౌదరి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నె సుబ్బనరసయ్య నాయుడు, కూచివారిపల్లె ఉపసర్పంచ్ మల్లికార్జున నాయుడు తదితరులు భేటీ అయ్యారు. రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వీరికి కావుటూరి సోదరులు, టీడీపీ యువ నాయకులు కావుటూరి భరత్, కావుటూరి లోకేశ్ బొకేలను అందజేసి శాలువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం నేతలకు విందు ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్ట :రాజంపేటకు విచ్చేసిన ఎంపీని ఒంటిమిట్ట మండల నాయకులు కొమరా వెంకటనరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, వినోద్‌రెడ్డి, రేవిళ్ల బాలమునెయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మఠం రాజు తదితరులు సత్కరించారు. సత్కరించారు. మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా జగన్‌మోహన్‌రాజు జన్మదినోత్సవం



టీడీపీ నేతలతో కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు



చమర్తికి వేంకటేశ్వరుడి ప్రతిమను అందజేస్తున్న బలిజ సంఘం నేతలు

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో మంగళవారం రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు హాజరయ్యారు. బాణసంచా పేలుళ్లు, మంగళవాయిద్యాల నడుమ జగన్ మోహన్ రాజును ఆహ్వానించారు. సుమారు 54 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. శాలువాలు, గజమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేట మార్కెట్‌కమిటీ చైర్మన్ గన్నె సుబ్బనరసయ్యానాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్ నాయుడు, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, పట్టణ అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యెద్దల విజయసాగర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కె.చెంగల్‌రాయుడు, ఆరు మండలాల టీడీపీ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చమర్తి మాట్లా డుతూ తన జన్మదినోత్సవాలను అత్యంత వైభ వంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ నేతలు ఏకతాటిపై నిలిచి ఈ వేడుకల్లో పాల్గొనడం చూస్తుంటే నూతనోత్సాహం కలుగుతోందన్నారు. సీనియర్ నాయకులకు కొన్ని పదవులు ఇచ్చామని, కష్టపడ్డ మిగిలిన నేతలకు ప్రాధాన్యతపరంగా రానున్నరోజుల్లో అన్ని రకాల పదవులు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. సిద్దవటం, ఒంటిమిట్టల్లో ఆయా ప్రాంతాల నేతలు వేడుకలు నిర్వహించారు.

నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అమర్‌నాథ్

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ హెచ్చరించారు. మంగళవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్, మండల పరిషత్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు గుంజనేరు, తిరుపతి ఏరు, మేకగుంతేరు, గుండాలేరు తదితర నదుల వద్దకు వెళ్లరాదని తెలిపారు. పూరిళ్లలో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీఆర్‌వోలు, గ్రామ కార్యదర్శులు తదితరులు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవడంతోపాటు, అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు. నదుల వద్దకు చిన్న పిల్లలను తీసుకుని వెళ్లరాదన్నారు. ఈ సమావేశం లో ఎంపీడీవో నాగిరెడ్డి, విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏడీ డీ. మురళీధర్‌రెడ్డి, ఏఈలు సుబ్రహ్మణ్యం, యోగానందం పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని నదీ పరి వాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెన్నానదిలోకి ఎవరూ దిగవద్దని మండల తహసీల్దారు ఆకుల తిరుమలబాబు హెచ్చరించారు తెలిపారు. జ్యోతి, గొల్లపల్లె, వంతాటిపల్లె, ఆకుల వీధి, జంగాలవీధి, వెలుగుపల్లె ప్రాంత ప్రజలు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. జాలర్లు పెన్నానదిలోకి దిగరాదన్నారు.

రాజంపేట : భారీ వర్షాలతో ఇబ్బందులు తలెత్తితే 08565-240336 నంబరుకు సమాచారం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. చెయ్యేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ నది వద్దకు వెళ్లరాదని తహసీల్దారు పీర్‌మున్నీ హెచ్చరించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ఏపీఎస్పీ సేవలు చిరస్మరణీయం



అమరవీరుల స్థూపం వద్ద వందన సమర్పణ చేస్తున్న కమాండెంట్ ఆదిరెడ్డి

సిద్దవటం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో బెటాలియన్ పోలీసుల సేవలు మరువలేనివని కమాండెంట్ ఆదిరెడ్డి తెలిపారు. 11వ బెటాలియన్‌లో మంగళవారం పోలీసుల అమరవీరుల దినం సందర్భంగా ఆయన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ని వాళులర్పించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అసిస్టెంట్ కమాండెంట్, డీఎస్పీ కె.వెంకటరెడ్డి అమరులైన పోలీసుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ దేశ సంరక్షణలో భాగంగా అసాం ఘిక శక్తులను ఎదుర్కోవడంలో ఎన్నో వేలమంది పోలీసులు అశువులు బాశారన్నారు. వారిని స్మరించుకునేందుకే అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పోలీసు అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ దివ్యరాణి, ఆర్ఐ, ఆర్ఎస్ఐ, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు : స్థానిక పోలీసుస్టేషన్‌లో సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వారికి నివాళులర్పించారు. ఏఎస్ఐ లక్ష్మీదేవి, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, సిబ్బందిపాల్గొన్నారు.

రైల్వేకోడూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఎస్పీ ఉమేష్‌చంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రాజు, స్వామి, ఉమామహేశ్వర్‌రావు, అనంతరాజుపేట ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున పాల్గొన్నారు.

పెనగలూరు: పెనగలూరు ఎస్‌: బి.రవిప్రకాష్ రెడ్డి అధ్యక్షతన సిబ్బంది ఐపీఎస్ అధికారులు చదలవాడ ఉమేష్‌చంద్ర, కేఎస్‌వ్యాస్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించా రు. ఏఎస్ఐలు రాముడు, నాగరత్నమ్మ, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా వెలుగుల దీపావళి



దీపాలు వెలిగిస్తున్న బాలిక

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం దీపావళి పర్వదినం పురస్కరించుకుని ప్రతి ఇంట దీపకాంతులతో దీపావళి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు లక్ష్మీదేవికి, కుబేరుడికి పూజలు చేశారు. టపాసులు కాలుస్తూ సంబరం చేసుకున్నారు.

రైల్వేకోడూరు: మండలంలో మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులు వేశారు. చిన్నలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి, ఇళ్ల వద్ద టపాసులు కాల్చారు. రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజ లు తదితరులు ఆనందంగా దీపావళి పండుగను జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

రాజంపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా మంగళవారం ఏకగ్రీ వంగా జ్యోతి సాయికుమార్ ఎన్నుకున్నారు. ఆయనను రాజంపేట ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ం అసోసియేషన్ అభివృద్ధికి, శ్రమ కోసం పాటుపడతానని తెలిపారు.

కష్టమైన సబ్జెక్టును ఇష్టంగా చదవండి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో విద్యార్థులు కష్టమైన సబ్జెక్టును ఇష్టంగా చదవాలని, పదిలో ఉత్తమ ఫలితాలనుసాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం కోరారు. మంగళవారం గున్నికుంట్ల జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు తప్పనిసరిగా అప్పార్ ఐడీని వందశాతం పూర్తి చేయాలన్నారు. మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం పాఠశాలకు కంప్యూటర్ ఇచ్చిన జనార్దన్ రాజును, విద్యార్థుల వెయ్యి లీటర్ల నీళ్ల ట్యాంకును ఇచ్చిన వెంకట్రామిరెడ్డిని ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సీజీకే రామచంద్రరాజు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు మనోహర్, చక్రపాణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

రాయచోటి - నేతాజీ సర్కిల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల వ్యాప్తంగా 23 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కలీముల్లాబేగం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు, 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు వేలిముద్రల అప్‌డేట్, ఆధార్‌లో చిరునామా, ఫొటో మార్పులు, ఫోన్ నెంబర్ లింకు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలలు, స్కూల్స్‌లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న సాయిలోకేశ్, రమేశ్‌నాయుడు

సుండుపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగొల్లపల్లె పంచాయతీకి చెందిన సోమినేని తిమ్మయ్యకు మంగళవారం రూ.1.03 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె మండల అధ్యక్షుడు రమణగౌడ్, బీజేవైయం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిచర్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం



పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం అధికారులు

చిన్నమండెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమండెం, చిన్నర్సుపల్లె, బోరెడ్డిగారిపల్లెల్లో వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం అధికారులు, వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. వరి పంటలో ముఖ్యంగా ఆకు చుట్టుపురుగు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీని ఉధృతిని తగ్గించేందుకు వరి పొలాల్లో కాలిబాటలు తీయాలని సూచించారు. మడులలో నీటిని పూర్తిగా తీసివేసి కొద్దిగా ఆరబెట్టాలని, యూరియా వాడరాదని తెలిపారు. అగ్గితెగులు నివారణకు కాసుగామైసిన్ 3 శాతం ఎస్ఎల్ 600 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలని, సుడిదోమ నివారణ కోసం ట్రైప్లో మిజోఫైరామ్ 94 మి.లీ ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి దుబ్బు మొదట్లో బాగా తడిచేటట్లు పిచికారి చేయాలని సూచించారు. ఆకుచుట్టుపురుగు, కాండం తొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫోస్ 250 ఎంఎల్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకష్ణంరాజు, మండల వ్యవసాయాధికారి గీత, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పుష్ప, ఎంపీఈవో, రైతులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు సూర్యుడునాయక్ తెలిపారు. మంగళవారం దేవళంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు ఇవ్వాల్సిన 4 డీఏల్లో ఒక డీఏను మాత్రమే ప్రభుత్వం ప్రకటించిందని ఇందులో 3.640 శాతంగా ప్రకటించడం హర్షణీయన్నారు. అయితే ఉత్తర్వులు సంఖ్య 60, 61లో డీఏ అంటే డెత్ ఆఫ్టర్ లేదా రిటైర్మెంట్ ఆఫ్టర్ అని సరికొత్త నిర్వచనం ఇవ్వడం సరికాదన్నారు. కరువు భత్యం అంటే కాటికి పోయాక వచ్చేది కాదని, కాలానుగుణంగా వచ్చేదని, కాబట్టి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా దీనిని వెంటనే సవరించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు కూడా తక్షణమే పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, కృష్ణంరాజు, రెడ్డెయ్య, భాస్కర్, రాణి, నాగరత్న, రామాంజినే యులు, రవి, రాంమోహన్, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

గుండ్లకుంట చెరువు అలుగుల పరిశీలన



అలుగులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశులు

రామాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలిబిడికి సమీపంలో ఉన్న గుండ్లకుంట చెరువు అలుగులను మంగళవారం రామాపురం తహసీల్దార్ వెంకటేశు లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇటీవల కురు స్తున్న వర్షాలకు నీరు చేరడంతో చెరువు నిండిందని, అలుగులపై పెద్ద పెద్ద మట్టి కుప్పలు ఉండడంతో చెరువు తెగే ప్రమాదం ఏర్పడిందని గ్రామ స్తులు సమాచారం అందించారు. దీంతో ఆయన చెరువును పరిశీలించి అలుగుల వద్ద ఉన్న మట్టి కుప్పలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వాసుదేవ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మహబూబ్‌బాషా, ఆర్ఐ సమ్మత్‌ఖాన్, టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రామసుబ్బయ్య, చిటిరెడ్డి, బీకాం యల్లయ్య, ధనుంజయ, నాగరాజు, దానప్ప, శ్రీనివాసులు, వీఆర్‌వో రాధిక, గ్రామ సర్వేయర్ బాబ్జాన్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎంఈవో



మొక్కలు నాటుతున్న ఎంఈవో ఈశ్వరయ్య తదితరులు

చిట్వేలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని మండల విద్యాశాఖాధికారి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో సామాజిక కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకృతి సంరక్షణను ఓ యజ్ఞంలా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది గంగాదేవి, పెంచలయ్య, షేక్ షబ్బీర్‌బాషా, ఎ.మౌలాన, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీళ్లు లేని చెరువులు ... బీళ్లుగా భూములు

● రాజంపేట డివిజన్‌లో చెరువుల్లో నీరు లేక వెలవెల
● దిగాలు చెందుతున్న రైతన్నలు

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రమంతా భారీ ఎత్తున వర్షాలు కురిసి నదులు, వాగులు పొంగి ప్రవహిస్తూ చెరువులు, కుంటలు, బోరుబావులకు పెద్దఎత్తున నీరు చేరి వ్యవసాయానికి సిద్ధమై పచ్చని పంట పొలాలతో కళకళలాడుతుండగా రాజంపేట డివిజన్‌లో పూర్తిగా కరవు ఛాయలు ఏర్పడ్డాయి. అప్పుడప్పుడూ చెదురుమదురు వర్షాలు కురుస్తూ గడ్డి, కంపచెట్లు పచ్చగా మారగా ఎక్కడా కనీస వర్షపాతం కూడా పడలేదు. ఏడాదికి 720 మి.మీ. కనీస వర్షపాతం రాజంపేట ప్రాంతంలో కురవాల్సి ఉండగా ఇప్పటికి 200 మి.మీ. వర్షపాతం కూడా నమోదు కాలేదు.

తిరుపతి జిల్లాకు శేషాచలం అడవులు ఆనుకుని ఉన్న ఒక్క రైల్వేకోడూరు మండలంలో కొద్దిపాటి వర్షం పడింది తప్ప మిగిలిన మండలాల్లో దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మామూలుగా ఉమ్మడి కడప జిల్లాలో పంట పొలాలకు, పాడికి రాజంపేట డివిజన్ పెట్టింది పేరు. ఇక్కడ 200కు పైబడి చెరువులు, కుంటలు ఉన్నాయి. ఒక్క ప్రాజెక్టు లేకపోయినప్పటికి ఒకవైపు శేషాచలం కొండలు, మరోవైపు నెల్లూరు సరిహద్దు పెనుశిల అభయారణ్య అడవులు ఉండడం వల్ల సహజంగానే వర్షాలు కురవడం. దీనివల్ల చెరువులు, కుంటలు నిండడం, బోరుబావుల్లో



చెరువులో నీరు లేక సాగుకు నోచుకోని భూములు

చుక్కనీరు లేక వెలవెలబోతున్న ఊటుకూరు చెరువు



భూగర్భజలాలు పెరగడం, తద్వారా లక్ష ఎకరాలకు పైబడి సాగవుతూ ఉండేది. చెరువులు, కుంటల కిందే ఈ లక్ష ఎకరాల వరి పంట పండేది. వరి ధాన్యం విస్తారంగా పండడం వల్ల ఈ రెండు నియోజకవర్గాల రైతులకు పుష్కలంగా ఏడాదికి కావాల్సిన ఆహారం లభించి వేల టన్నుల వరి పంటను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు గడించేవారు. రెండు సంవత్సరాలుగా ఏమైందో ఏమోగాని కనీస వర్షపాతం నమోదు కాలేదు. ఒక మోస్తరు వర్షాల వల్ల తాగునీరు లభిస్తుందే తప్ప సాగునీరు లభించడం లేదు. రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, ఒంటిమిట్ట ప్రాంతాల్లోని పెద్దఓరంపాడు చెరువు,

చుక్కనీరు లేక రైతులను వెక్కిరిస్తున్న హస్తవరం చెరువు



ఎల్లమరాజుచెరువు, రెడ్డిపల్లె చెరువు, నగిరిపాడు చెరువు, నాగవరం, చెరువులు, ఊటుకూరు, చెర్లోపల్లె, తాళ్లపాక, లేబాక, ఒంటిమిట్ట, మైలపల్లెల్లోని వందలాది చెరువులు వరదనీరు రాక చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. దీనివల్ల ఆయకట్టు భూములన్నీ బీటలు వారి ఉన్నాయి. ఒక్కో రైతుకు చెరువుల కింద ఎకరా నుంచి 50 ఎకరాల పొలం ఉన్న రైతులున్నారు. ఈ పొలాలన్నీ వరి పంట పండేవే. అయితే వర్షాలు పడకపోవడంతో ఈ భూములన్నీ ప్రస్తుతం బీటలువారి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో మాత్రం వరి పంట విస్తారంగా సాగవుతోంది.

రెండేళ్లుగా వర్షాలు అంతంత మాత్రమే



రెండేళ్లుగా వర్షాలు కురవక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ సమయానికే బాగా వర్షాలు కురిసి వరి పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం వర్షాలే కురవకపోవడంతో భూములన్నీ బీళ్లుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల వరి పంట పండించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి పరిస్థితి నుంచి ఇంటి అవసరాలకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

-బండారు బాలయ్య, రైతు, మన్నూరు, రాజంపేట

లక్ష ఎకరాల్లో సాగయ్యేది



బాగా వర్షాలు కురిస్తే రాజంపేట డివిజన్‌లో చెరువులు, బోరు బావులు, కుంటల కింద లక్ష ఎకరాల్లో వరి పంట సాగయ్యేది. అటువంటిది చెరువుల కింద ఒక్క ఎకరా కూడా పండే పరిస్థితి కనిపించడం లేదు వాతావరణ ప్రతికూల పరిస్థితులే ఇందుకు కారణం. ఏ గ్రామంలో చూసినా చెరువుల కింద వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తూ పచ్చని పొలాలతో కళకళలాడే పరిస్థితి నుంచి నేడు ఎకరా సాగు కాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

- మధుసూదన్‌రెడ్డి, రైతు, తాళ్లపాక, రాజంపేట మండలం

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు మెస్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం పులివెందుల జేఎన్టీయూలోని మెస్ ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెస్ ఇన్‌చార్జి, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి ఆయన వంటగది, ఆహార నిల్వ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్ గదులు, పరిసరాలు, టాయిలెట్లు, డ్రింకింగ్ వాటర్ సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి వాతావరణం ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, మెస్ మేనేజర్ జి.మురళి పాల్గొన్నారు.

సీబీఆర్‌కు నీటి విడుదల నిలిపివేత



లింగాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. గండికోట ప్రాజెక్టు నుంచి నెల రోజులుగా ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హత్య కేసుగా నమోదు చేసిన టూటౌన్ పోలీసులు



శశికళ (ఫైల్)

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం శేషప్పతోటకు చెందిన వెంకటరమణ, శశికళకు 30 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి సృజన్ అనే కుమారుడు, సాత్విక వర్షిణీ అనే అమ్మాయి ఉన్నారు. వెంకటరమణ గతంలో బీఎస్ఎఫ్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు 20 ఏళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. అయితే కుమారుడు, కుమార్తె ఇద్దరూ తల్లి వద్దే ఉంటూ చదువుకున్నారు. ప్రస్తుతం కుమారుడు సృజన్ ఉద్యోగపరంగా బయట ఉండడంతో, కుమార్తె సాత్వికవర్షిణీ లండన్‌లో ఎంఎస్సీ చదువుతోంది. వారిది సొంత ఇల్లు కావడంతో ప్రస్తుతం శశికళ ఒక్కరే ఇంట్లో ఉంటోంది. ఇదిలా ఉండగా ఈనెల 6వ తేదీ మదనపల్లెకు వచ్చిన వెంకటరమణ తన తమ్ముడు రాజన్నతో కలిసి శేషప్పతోటలోని ఇంటికి వెళ్లి ఇల్లు తన పేరిట ఉందని, తనకు ఇవ్వాలని భార్య శశికళతో గొడవపడ్డారు. దీనికి ఆమె నిరాకరించడంతో కొట్టి బలవంతంగా నోట్లో యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే ఆమె లండన్‌లోని తన కుమార్తెకు సమాచారం ఇచ్చింది. స్థానికులు శశికళను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతి చెందింది. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శశికళ కుమారుడు సృజన్ ఫిర్యాదు మేరకు టూటౌన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మంగళవారం హత్య కేసుగా మార్చామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

కారు, బస్సు ఢీ : నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెద్దమండ్యం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం కోటకాడపల్లి పంచాయతీ తాటిమాకులపల్లి వాసి కుళాయిరెడ్డి, మదనపల్లిలో సచివాలయ ఉద్యోగి. కాగా ఆదే గ్రామానికి చెందిన స్రవంతి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీరు దీపావళి పండుగకు స్వగ్రామానికి వచ్చి తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి మంగళవారం ఉదయం కలిచెర్ల బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నారు. కాగా గాలివీడు మండలం ప్యారంపల్లి పంచాయతీ పూలవాండ్లపల్లికు చెందిన జగదీష్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన స్నేహితుడితో కలిసి కారులో బెంగుళూరుకు బయలుదేరారు. కలిచెర్ల బస్టాప్ వద్ద చేరుకున్న కారులోని జగదీష్‌రెడ్డిని లిఫ్ట్ అడిగి అందులో బయలుదేరారు. బండమీదపల్లి పంచాయతీ కొట్టివాండ్లపల్లి దాబా వద్ద కారు అదుపు తప్పి మదనపల్లి నుంచి గాలివీడుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆ నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. వీరిలో కుళాయిరెడ్డి, స్రవంతి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం పోలీసులు వెల్లడించారు.

విషద్రావణం తాగి మహిళ మృతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామం రాగిమాకులపల్లె వాసి విశ్వనాథరెడ్డి భార్య శారద (40) ఆదివారం కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి మనస్థాపంతో విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. సోమవారం సాయంత్రం మృతి చెందింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు

● విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు
● జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం డైట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని 8 నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహనను పెంపొందించడానికి, లైంగిక దాడుల నుంచి మహిళలు, బాలల రక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలు రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రం, మదనపల్లి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, రాజంపేట పట్టణంలోని మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో డివిజన్ వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి జిల్లా



మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం

స్థాయిలో పోటీలను 26వ తేదీ ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడతాటలి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుమలో గంగమ్మ పూజకు వెళుతూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. ముగ్గురికి గాయాలు





తేజ (ఫైల్), ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కనుమలో గంగమ్మ ఆలయంలో జరిగే పూజకు వెళుతూ జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళవారం ఉదయం కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ చింతయ్యగారికోటకు చెందిన యువకులు బైక్‌పై మదనపల్లె మండలం బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డులో ఉన్న కనుమలో గంగమ్మ ఆలయంలో చేస్తున్న పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతూ బసినికొండ వద్ద జాతీయ రహదారి కూడలిలో రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో చింతయ్యగారికోటకు చెందిన రవి కుమారుడు తేజ (19) అక్కడికక్కడే మృతి చెందగా అతడి బైక్‌లో వెనకనున్న రాధాకృష్ణ కుమారుడు జగదీశ్ (20) గాయపడ్డాడు. మరో బైక్‌లో ఉన్న వేంపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు సంతోష్ (21), మహేశ్ కుమారుడు ప్రేమకుమార్ (8) గాయపడ్డారు. వేంపల్లె నుంచి నిమ్మనపల్లెకు తమ అక్క ఇంటికి బైక్‌లో బయలుదేరిన వీరి బైక్ తట్టివారిపల్లె వైపు నుంచి వస్తున్న బైక్‌ను ఢీ కొంది. స్థానికులు క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మదనపల్లె తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

భూములు దక్కలేదని వ్యక్తి ఆత్మహత్య

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామంలో ఉన్న తమ భూములు తమకు దక్కలేదన్న బాధతో మద్యానికి బానిసైన గురజాల పాపారావు (48) సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడుకు చెందిన గురజాల పాపారావు కొంతకాలంగా రాయచోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో న్యాచురల్ జ్యూస్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని తమ భూముల కోసం అధికారుల చుట్టూ తిరిగినా, తమకు దక్కకపోవడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలియజేశారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో మృతి చెందిన వ్యక్తిని తన భర్తగా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి ఆ వ్యక్తి కుటుంబాన్ని బెదిరిస్తున్న షేక్ అమీనా అనే మహిళపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కడప టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు కడప అగాడికి చెందిన తాజున్నిసా అనే మహిళ భర్త మహబూబ్‌బాషా 2015లో మృతి చెందాడు. అయితే షేక్ అమీనా అనే మహిళ గత కొంతకాలంగా మహబూబ్‌బాషా తన భర్త అని, తమకు నసీమా అనే కుమార్తె కూడా ఉందంటూ వారిద్దరి మ్యారేజ్ సర్టిఫికెట్ చూపించి ఆస్తుల్లో భాగం కావాలని తాజున్నిసాను బెదిరిస్తుండేది. దీంతో ఆమె గురించి చుట్టుపక్కల విచారించగా ఆమె లక్ష్మిదేవి అని గుర్తించారు. దీంతో ఆమె దగ్గర ఉన్న మ్యారేజ్ సర్టిఫికెట్లను పరిశీలించగా అవి నకిలీవని గుర్తించినట్లు తెలిపారు. తాజున్నిసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ అమీనా అలియాస్ లక్ష్మిదేవిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్సు-లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



బస్సు లారీ ఢీ కొన్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో మంగళవారం ఆర్టీసీ బస్సు లారీని ఢీకొంది. ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుంచి ప్రొద్దుటూరు వెళ్లేందుకు బస్టాండు నుంచి సర్కిల్ సమీపానికి రాగానే ముద్దనూరు వైపు నుంచి కడప వైపు వెళుతున్న లారీ రావడంతో అదుపు తప్పి ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఆర్టీసీ బస్సు అద్దాలు పగిలాయి. కాగా, ఎర్రగుంట్ల బస్టాండు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే బస్సులన్నీ సర్కిల్‌ను చుట్టి రాకుండా రాంగ్ రూటులో నేరుగా బ్రిడ్జిపైకి వెళ్లడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

8 మంది జూదరుల అరెస్టు

కడప క్రైం, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన 8 మంది జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసిన వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వల్లూరులో నలుగురు...

వల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లెలో మంగళవారం నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జోనల్ మలేరియా అధికారిగా

అలెగ్జాండర్ బాధ్యతల స్వీకరణ



కడప (కలెక్టరేట్), అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): కడప జోనల్ మలేరియా అధికారిగా డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ మంగళవారం పాత రిమ్స్‌లోని జెడ్ఎంవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన టెక్కలి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కడప జోనల్ మలేరియా కార్యాలయానికి బదిలీపై వచ్చారు. రెండు నెలల కిందట జెడ్ఎంవోగా విధులు నిర్వహిస్తూ డాక్టర్ జమాల్‌బాష పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో ఇప్పటివరకు రిమ్స్ ఆర్ఎంవో శ్రీనివాసులు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు మంచూరు విద్యార్థి



పాఠశాల హెచ్ఎం ప్రకాష్, ఉపాధ్యాయులతో విద్యార్థి వెంకటరమణ

వాల్మీకిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అండర్-19 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు కొత్తమంచూరు హైస్కూలు విద్యార్థి వెంకటరమణ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ప్రకాష్, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డివరప్రసాద్ తెలిపారు. రెండు రోజుల కిందట మదనపల్లె రూరల్ మండలం చిన్నతిప్పసముద్రం జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెంకటరమణ విశేష ప్రతిభ కనబరచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి వెంకటరమణను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రౌడీ షీటర్లపై నిఘా ఉంచండి

గుర్రంకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ రఘురాం సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లో మంగళవారం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రౌడీ షీటర్లపై ఆయా గ్రామ పోలీస్ అధికారి నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించి వివరాలను తెలపాలన్నారు. నాటు సారా, బెల్టు షాపు నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో సునీల్ (22) గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజమండ్రికి చెందిన ప్రసాదరావు కుమారుడు సునీల్ పట్టణంలోని మెగా ఆగ్రో ఏజన్సీలో పనిచేస్తున్నాడు. తట్టివారిపల్లె వద్ద తన యాజమానిని కలవడానికి వెళుతుండగా ఎస్టేట్ సమీపంలోని బాలాజీ కాలనీ మున్సిపల్ బోర్డు వద్ద మరొక బైక్ ఢీకొనడంతో యువకుడి తలకు గాయమైంది. స్థానికులు వెంటనే యువకుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

వేడుకగా దీపావళి

- ఉవ్వెత్తున ఎగిసిన బాణ సంచా పేలుళ్లు
- ఆలయాల్లో కేదారేశ్వర వ్రతం
- అలంకరించిన పోలీసు స్టేషన్లు



ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు (పీలేరు)

పీలేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నిప్పులు వెదజల్లుతూ నింగికెగిసిన రాకెట్లు, చేతిలోనే వెలుగులు విరజిమ్మిన కాకర పూలు, భూమిపై గింగిరాలు తిరిగిన భూచక్రాలు, పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ పేలిన ఆటంబాంబులు ఒక్కటేమిటి రకరకాల బాణసంచా పేలుళ్ల నడుమ దీపావళిని ప్రజలు వేడుకగా చేసుకున్నారు. ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చెబుతారు. పలువురు కుటుంబీకులు అమావాస్య నోములు, కేదారేశ్వర గౌరీ వ్రతం ఆచరించేందుకు వేకువనుంచే ఆలయాలకు పోటెత్తారు. కాశీవిశ్వేశ్వర స్వామి, రౌద్రాల అంకాలమ్మ, అగ్రహారం లక్ష్మీనరసిం హస్వామి ఆలయాల్లో పెద్దఎత్తున మహిళలు నోములు నోచుకున్నారు. వ్యాపారులు, దుకాణ దారులు, వాహనదారులు ఆయుధపూజ చేసుకున్నారు.

ఇంటింటా సాగిన లక్ష్మీ పూజలు

వాల్మీకిపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రతి ఇంటి ముంగిట బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఇంటింటా లక్ష్మీ పూజలు సాగాయి. మంగళవారం అమావాస్య సందర్భంగా కోనేటివీధిలోని లక్ష్మీ కామేశ్వరస్వామి ఆలయం, పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం సమూహాలయాల్లో కేదారేశ్వర, గౌరీ వ్రత వేడుకలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ధర్మపథం ఆలయంలోని లింగోద్భవ మహాశివుడికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోనవరపు శీనాస్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





పీలేరు శివాలయంలో అమావాస్య నోము ఆచరిస్తున్న మహిళలు - మదనపల్లె మడికయ్యల శివాలయంలో కేదారేశ్వరస్వామి వ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో వేడుకలు

గుర్రంకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. ఉదయాన్నే మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కేదారేశ్వర వత్రాన్ని భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. పిల్లలు, పెద్దలు బాణసంచా పేల్చి పండుగను సంతోషంగా చేసుకున్నారు.

గ్రామాల్లో పండుగ శోభ

కలకడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు దీపావళి పండుగను వేడుకగా చేసుకున్నారు. పట్టణాల్లో స్థిరపడ్డ వారు స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు పండుగ శోభను సంతరించుకున్నాయి. మహిళలు ఇళ్ల లోగిళ్లలో దీపాలు వెలిగించారు. పెద్దలు, చిన్నారులు బాణసంచా కాల్చుతూ కాంతులకు మురిసిపడుతూ సంబరాలు చేసుకున్నారు.

కురబలకోటలో వేడుకగా యువత

కురబలకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు దీపావళి వేడుకలు చేసుకున్నారు. అంగళ్ళు, కురబలకోట, తెట్టు, ముదివేడు తదితర గ్రామాల్లో యువత బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కాగా ఎన్ఆర్ఐ కొణిదల లోకేష్ ఆధ్వర్యంలో ముదివేడు యూత్‌కు టపాకాయలు, స్వీట్ బాక్సులను ఉంచితంగా అందజేశారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో దీపావళి వేడుకలు చేసుకున్నారు. కళాశాల విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

శోభాయామానంగా అలంకరణ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీపావళి వేడుక నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ కార్యాలయం, వన్‌టౌన్, టూ టౌన్, తాలుకా, రూరల్ సర్కిల్‌లో పోలీసు స్టేషన్లను శోభాయామానంగా అలంకరించారు. మహిళలు ఇంటి ముంగిళ్లలో దీపారాధన చేసి వెలుగులు నింపారు. శివాలయాల్లో అమావాస్య నోములు చేసుకున్నారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి, నీరుగట్టువారిపల్లెలో నీలకంఠేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిప్పిలిలోని యోగభోగేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు విశ్వేశ్వర ప్రసాద్, ఈఓ రమణ కేదారేశ్వర నోములు చేయించారు. మహిళలు పూజా సామగ్రి, అరిశలు దేవునికి నైవేద్యంగా సమర్పించి నోములు చేసుకున్నారు. సీటీఎంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మహిళలు నోము ఆచరించారు.

సందడిగా బాణసంచా పేలుళ్లు

తంబళ్లపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళిని ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకగా చేసుకున్నారు. చిన్నారులు, యువత, పెద్దలు కుటుంబ సభ్యులందరూ ఒక చోట చేరి టపాసులు పేల్చుతూ సందడి చేశారు. వ్యాపార దుకాణాల్లో ధనలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించారు.



విశేష పూజలందుకుంటున్న లక్ష్మీకామేశ్వరస్వామి (వాల్మీకిపురం)

బి.కొత్తకోటలో దీపావళి వేడుకలు

బి.కొత్తకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణం సహా మండల వ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు వేడుకగా చేసుకున్నారు. అమ్మవారి ఆలయాలు, హార్సిలీహిల్స్‌లోని ఏనుగుమల్లమ్మ, షిర్డిసాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. గుమ్మాల్లో దీపాలు వెలిగించి, బాణసంచా పేల్చి పండుగను ఉత్సాహంగా చేసుకున్నారు. నగరపంచాయతీ కమీషనర్ జీవీపల్లవి, సీఐ గోపాల్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.











వాల్మీకిపురంలో పూజలందుకుంటున్న లింగోద్భవ మహాశివుడు - కలకడలో దీపావళి సంబరాల్లో చిన్నారి - బి.కొత్తకోటలో బాలురు - మదనపల్లె వెలుగు సంస్థలో దీపావళి వేడుకల్లో ఫైర్ ఆఫీసర్ శివప్ప - ప్రత్యేక అలంకరణలో కాశీ విశాలాక్షి అమ్మవారు (పీలేరు)



ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ(బి.కొత్తకోట)

స్తంభించిన జనజీవనం

కలకడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంగళవారం కురిసిన వర్షంతో జన జీవనం స్తంభించింది. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఏడతెరపి లేకుండా చినుకులు పడ్డాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలో 2వేల పైచిలుకు ఎకరాల్లో టమోటా పంట సాగైంది. పక్వానికి వచ్చిన కాయలను కోసి మార్కెట్‌కు తరలించేందుకు కూలీలు దొరక్క రైతులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు ఇళ్లకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 18 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు ఇన్‌చార్జ్ ఏఎస్ఓ రెడెప్పనాయుడు తెలిపారు.

ఘనంగా సంస్మరణ దినోత్సవం

పీలేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం మంగళవారం పీలేరు పోలీసు స్టేషన్‌లో చేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పలువురి చిత్రపటాలను ఆవిష్కరించి వారికి ఘనంగా నివాళులర్పించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పునరంకితం కావాలని అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

ఓబీసీలను బలోపేతం చేద్దాం



ఎంపీలు, జాతీయ కురబ సంఘం నేతలను సన్మానిస్తున్న సౌత్ ఇండియా ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఓబీసీలను బలోపేతం చేయడానికే ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సౌత్ ఇండియా ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల రాజధానిలో ఏర్పాటు చేసిన ఓబీసీల సమావేశంలో గోవా డిప్యూటీ సీఎం ఎంపీలు బీద మస్తాన్‌రావు యాదవ్, పాకా సత్యనారాయణ హాజరై దేశంలో ఓబీసీల అభ్యున్నతికి కృషి చేయనున్నట్లు వివరించారని తెలిపారు. 30 ఏళ్లగా ఆర్ కృష్ణయ్యతో కలిసి అనేక ఉద్యమాల్లో పోరాటాలు చేశారన్నారు. బీజేపీ సభ్యతం పొందిన జబ్బల బీసీల మన్నలు పొందాడని, భవిష్యత్‌లో బీజేపీలోకి బీసీ, ఓబీసీలను అధికంగా తీసుకెళ్లి ఓబీసీల ఉన్నతికి పాటు పడతానని ఆయన తెలిపారు.

పోలీసుల త్యాగం మరువలేనిది



పోలీసు అమరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

నిమ్మనపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అమర పోలీసుల త్యాగం మరువలేనిదని వక్తలు అన్నారు. అమర పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో సమాజం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసులకు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ తిప్పేస్వామి, సిబ్బంది నివాళులర్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ గతేడాది దేశ వ్యాప్తంగా 191 మంది పోలీసులు ప్రాణాలు విడిచారన్నారు. ప్రాణ త్యాగం చేసిన పోలీసు కుటుంబ సభ్యులకు పోలీసులు అండగా వుంటారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కాని స్టేబుల్ రమణ, పోలీసులు శివ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నాణ్యత పరిశీలన



సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లిలో నిర్మించిన సీసీరోడ్డు నాణ్యతను మంగళవారం ఎంపీడీఓ రమేష్, ఇన్‌చార్జి పీఆర్ ఏఈ నాగరాజ తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ లింకు రోడ్లలో భాగంగా ఉప్పరపల్లి నుంచి మెయిన్ రోడ్డు వరకు దాదాపు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అయితే సీసీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్లు రాజీ పడకుండా నాణ్యతగా నిర్మిచాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంలో నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మమత, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో బాలికలకు అన్ని విధాలా అనర్థాలు ఎదుర్కోవాల్సి వుంటుందని ఏసీడీపీఓ సునీత అన్నారు. అంతర్జాతీ య బాలికా దినోత్సవం సందర్భంగా బసినికొండ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఏసీడీపీఓ మాట్లాడుతూ చిన్నతనంలోనే వివాహాలు చేస్తే సామాజిక, ఆరోగ్యపర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. కౌమారదశ బాలికలు వ్యక్తిగ త శుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజంలో లింగ వివక్షత చూపరాదని, అలాంటి సంఘటనలు ఎదురైతే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంత రం జడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కళావతి, సచివాలయ సిబ్బంది రాణి, లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మణికంఠ

పెద్దతిప్పసముద్రం అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ అధ్వర్యంలో మంగళవారం కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ చాయేంద్ర అన్నమయ్య జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ (జీసీడీఓ) సుమతి కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు విలువైన సలహాలు, సూచనలు చేశారు. ఆటల పోటీలు వ్యాసరచన, వక్తృ త్వం పోటీలు, చిత్రలేఖనం, వంటి పోటీలను నిర్వహించారు. విజేతలకు జిల్లా కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ మణికంఠ ద్వారా సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ శైలజ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మొరవపోయిన గుమ్మసముద్రం చెరువు

- హంద్రీ-నీవా కాల్వకు పొంచివున్న ప్రమాదం
- కుడివైపునకు తరలించే యత్నంలో అధికారులు



ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటైన గమ్మసముద్రం చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు క్రమంగా నీరు చేరి సోమవారం మొరవపోయింది. ఈ చెరువుకు కుడి, ఎడమ రెండు వైపులా మొరవ వుంది. ఇందులో ఎడమ ఒడిగులవారిపల్లి వైపునున్న మొరవ నుంచి వెళ్లే మిగులు జలాలు నేరుగా చెరువు దిగువ భాగంలో వెళుతున్న హంద్రీ-నీవా కాల్వలో కలుస్తాయి. ఇప్పటికే ఎగువభాగంలో బడికాయలపల్లి చెరువు మొరవనీరు కాల్వలో కలుస్తుండడం, వర్షపునీరు చేరుతుండడంతో హంద్రీ-నీవా కాల్వలో ఎక్కువగా ప్రవాహం ఉంది. దీనికి తోడు గుమ్మసముద్రం మొరవనీరు కూడా కలిస్తే కాల్వకు ప్రమాదం పొంచి వున్నట్టేనని అధికారులు భావించారు. ఈ నీరు హంద్రీ-నీవా పీబీసీతో సంబంధం లేకుండా దిగువకు పంపించే నిర్మాణం పెండింగ్‌లో ఉండడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం హెచ్ఎన్ఎస్ఎస్, రెవెన్యూ అధికారులు గుమ్మసముద్రం చెరువు వద్దకు చేరుకుని కుడివైపుమొరవను హిటాచితో కాస్త తెగ్గొట్టి నీటిని మళ్లించారు. వర్షం కురుస్తూనే వుండడంతో నీటిప్రవాహం పెరగవచ్చన్న అనుమానంతో ఎడమ వైపు నుంచి హంద్రీనీవా కాల్వ వైపునకు రాకుండా ఇసుకబస్తాలతో అడ్డుకట్ట వేస్తున్నారు. మరోవైపు మొరవను తగ్గించడం వల్ల చెరువులో నీటినిల్వలు తగ్గిపోతాయని రైతులు వాపోతున్నారు.

బీరంగి చెరువు మొరవతో

ఇటీవల కురిసిన వర్షాలకు బీరంగి చెరువు నిండి మొరవపోతోంది.ఈ చెరు వు మిగులు జలాలు దిగువభాగంలో వున్న శంకరాపురం మీదుగా వెళ్లాల్సి వుంది. అయితే ఇందుకు సరైన కాల్వ నిర్మాణం లేదు. దీంతో బి.కొత్తకోట- బెంగళూరు ప్రధాన రహదారి పక్క నుంచి దిగువ వైపునకు వెళుతున్నాయి. రోడ్డుకు ఆనుకుని వెళుతుండడంతో మట్టి క్రమ క్షయానికి గురై రోడ్డుకింద అగాధం ఏర్పడుతోంది. ఇదిలాగే కొనసాగితే భారీ వాహనాలు రాకపోకల్లో రోడ్డు కుంగిపోయే ప్రమాదం వుందని స్థానికులు వాపోతు న్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి వుంది.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. 28న కలెక్టరేట్ వద్ద భవననిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సలీంబాషా పిలుపు నిచ్చారు. మంగళవారం నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు వద్ద ధర్నా కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోటి రుపాయలు జమ చేస్తానని ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులు తక్షణమే బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, మురళి, వెంకటరమణ, చిన్నప్పబాబు, రఫీ, శంకర, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యువతరంగ్‌కు మదనపల్లె విద్యార్థులు



ఎస్వీయూనివర్సిటీ యువతరంగ్‌లో ప్రతిభ చూపిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ యూనివర్సిటీ స్థాయి యువతరంగ్ పోటీలకు మదనపల్లె పట్టణ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 17,18, 19 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన ఇంటర్ కొలిజియేట్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో 37 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొనగా జానపద నృత్యం, ఫోక్, ఆర్కెస్ట్రా, వెస్ట్రన్‌గ్రూప్ సాంగ్ పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించారన్నారు. లైట్‌టకల్, క్రియేటివ్ కొరియోగ్రఫీ, గ్రూప్‌సాంగ్, స్పాట్ పెయింటింగ్, రంగోలి పోటీల్లో ద్వితీయ స్థానం, స్కిట్ పోటీలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్‌జోన్ యువతరంగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, డ్యాన్స్ మాస్టర్ సురేష్, డప్పు మాస్టర్ రామ్మోహన్, హరి, కీబోర్డు మాస్టర్ మురళి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తంబళ్లపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నజీర్, అమర, మల్లికార్జున గాయపడ్డారు. ములకలచెరువు మండలం దేవలచెరువు వాసులు నజీర్, అమర, మల్లికార్జున స్నేహితులు పెద్దేరు జలాశయాన్ని తిలకించేందుకు ద్విచక్రవాహనంలో వచ్చారు. ప్రాజెక్టును సందర్శించి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా తంబళ్లపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నజీర్ కాళ్లకు, అమర తలకు తీవ్ర గాయమవగా మల్లికార్జునకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన బాధితులను తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమచికిత్స అందించారు. ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం మదనపల్లెకు రెఫర్ చేశారు.

టెంపో ఢీకొనడంతో చిన్నారికి గాయాలు



చికిత్స పొందుతున్న చిన్నారి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి సాకేత్‌ను సోమవారం రాత్రి టెంపో ఢీకొనడంతో గాయాలయ్యాయి. కొండామరిపల్లె గ్రామం ఇసుకనూతనపల్లె వాసులు జాకీర్, రిహానా కుమారుడు ఆరేళ్ల సాకేత్ ఇంటిముందు ఆడుకుంటుండగా కొండామరిపల్లె వైపు నుంచి మదనపల్లెకు వస్తున్న టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన చిన్నారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.